క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ రాష్ట్ర కార్యదర్శిగా డానియల్



మహబూబాబాద్ అర్బన్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సాంబత్తిని డానియల్ నియమిస్తున్నట్లు సంఘం జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి రామయ్య హాజరై మాట్లాడుతూ.. డానియల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుదీర్ఘకాలంగా సంఘంలో పనిచేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. బదిలీపై మానుకోట జిల్లాకు రావడం అభినందనీయమన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చాగంటి ప్రభాకర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మద్దెల వీరస్వామి, ధరావత్‌భద్రు నాయక్, జిల్లా నాయకులు బోడ యాకూబ్ నాయక్, ఇంద్రగాంటి ఇద్దయ్య, కడారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో గల రైల్వేస్టేషన్ దగ్గర విద్యుత్ లైన్ టవర్ పనులు జరుగుతున్నందున పాత బజారులో నేడు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సంగీత ఆదివారం తెలిపారు. శిఖార్ ఖానాగడ్డ, సూర్యటాకీస్, మున్సిపల్ కార్యాలయం ఏరియా, అండర్ బ్రిడ్జి ఏరియా, రైల్వే స్టేషన్ రోడ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్, ఈద్గాబజార్, హెచ్‌పీ గ్యాస్ కార్యాలయ ఏరియాలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజయవంతం చేయాలి

కురవి: చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు (సోమవారం) హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమానికి అధిక సంఖ్యలో గిరిజనులు తరలిరావాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

దోర్నకల్: మండలంలోని తొడేళ్లగూడెం, ముల్కలపల్లి మార్గంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఖమ్మంలోని ఖానాపురం హవేలికి చెందిన దంతాల ఉపేందర్ ఆటో నడుపుతూ ముల్కలపల్లి వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడడంతో తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. సెల్‌ఫోన్, నగదును కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు 108 సిబ్బంది షమీమా, సైదులు తెలిపారు.

పేరు మార్చడం సరికాదు



మరిపెడ: మాకుల పుణ్యక్షేత్రంలో బావుసింగ్ బాబా, మేరమాయాడీల పేర్లను వేంకటేశ్వర స్వామిగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ లంబాడ ఐక్యవేదిక (లైవ్)ఆధ్వర్యంలో మండల కేంద్రంలో దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా సంఘం నాయకులు జాదవ్ రమేశ్‌నాయక్ మాట్లాడుతూ.. రేపు జరగబోయే మారెమ్మతల్లి పేరును మేరమయాడీగా మార్చాలని డిమాండ్ చేశారు. దీక్షకు బీఎస్పీ, బీఆర్‌టీయూ, సేవాలాల్‌సేన తదితర సంఘాలు మద్దతు తెలిపాయి. అభినాయక్, విజయ్‌కాంత్, శ్రీకుమార్, ప్రవిణ్‌నాయక్, భూక్య నగేష్, దేవేందర్ నాయక్, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్ సెంటర్‌లో జనవికాస అధ్వర్యంలో గ్రామానికి చెందిన చౌడారపు శ్రీనువాసు, చౌడారపు సంతోష్ సహకారంతో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో నాగలక్ష్మీ, సౌజన్య, మంగమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో హైదరాబాద్‌కు చెందిన అమిత్ అనే భక్తుడు ఆదివారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశాడు. ఆలయంలో, ఆలయం బయట భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించి తన భక్తిని చాటుకున్నారు.

ఉద్యమనేత వెంకటేశ్వర్లు

గార్ల: మండలంలో సీపీఐ బలోపేతానికి ఎనలేక కృషి చేసి అమరుడైన వెంకటేశ్వర్లు ప్రజా ఉద్యమ నేత అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టిబోయిన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని మద్దివంచ గ్రామంలో వెంకటేశ్వర్లు వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న, యాకూబ్, వెంకన్న, రాగం రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ నవమి

శ్రీరామ నవమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఆదివారం సీతారాములు కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలతో స్వామివార్లను అలంకరించారు. కల్యాణ మండపాల్లో అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ తంతూ జరిపించారు. సీతారాములు కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కనులార తిలకించారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

- సాక్షి నెట్‌వర్క్

గూడూరు: తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు



మానుకోటలో శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు



నెల్లికుదురు: రామన్నగూడెంలో సీతారాముల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



కేసముద్రం: కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు





మహబూబాబాద్ రూరల్: శనిగపురం గ్రామంలో..



దోర్నకల్: సీతారాముల కల్యాణ వేడుకలు...



మరిపెడ: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కురవి: రామాలయంలో..



మరిపెడ రూరల్: ఉల్లెపల్లి రామాలయంలో..



కొత్తగూడ: సీతారాముల ఊరేగింపు..



పెద్దవంగర: ఆలయంలో అన్నదానం..



గార్ల: తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



దంతాలపల్లి: వేములపల్లి గ్రామంలో..



పెద్దవంగర: ఉప్పరగూడెం రామాలయంలో..



చిన్నగూడూరు రామాలయంలో..



తొర్రూరు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రు నాయక్ అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఆనేపురం గ్రామంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తుందని విమర్శించారు. అనంతరం రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, గుగులోతు రవినాయక్, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, అఫ్జల్, గుండగాని వెంకన్న పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

అర్హుల ఎంపికలో అక్రమాలకు పాల్పడవద్దు

డోర్నకల్: ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్రమాలకు పాల్పడవద్దని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారంటీలతోపాటు అనేక సంక్షేమ పథకాలను స్వల్పకాలంలో సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వానికి చెడు పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, ఇన్‌చార్జ్ కాలం రవీందర్‌రెడ్డి, నాయకులు మాదా శ్రీనివాస్, ఎస్ వెంకటేశ్వర్లు, ఎల్లావుల హరికృష్ణ, రెడ్డిబోయిన శంకర్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

దోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలోని ఓ ఇంట్లో ఆదివారం అగ్నిప్రమాదంలో వస్తు సామగ్రి దగ్ధమై ఆస్తినష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన చెర్కుపల్లి శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో జరుగుతున్న శ్రీరామనమి వేడుకలకు వెళ్లగా ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు ఆర్పగా ప్రమాదంలో రూ.35వేల నగదు, టీవీ, బీరువా, మంచం, దుస్తులు, వస్తు సామగ్రి దగ్ధమై లక్ష రూపాయలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

సీసీ రోడ్లతో తండాలు అభివృద్ధి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కురవి: సీసీరోడ్లతో తండాలు అభివృద్ధి చెందుతాయని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సీరోలు మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తూరు(సీ) గ్రామ శివారు గుజిలి తండాలో రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాల్లో అంతర్గత రోడ్లు బురదమయంగా ఉండేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ సహకారంతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు, నాయకులు బోడ రమేష్, జాటోత్ లక్ష్మణ్‌నాయక్, బాదావత్ సిరి, కృష్ణ, జాటోత్ ప్రేమ్, రవి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



గూడూరు: వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



గార్ల: పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కురవి: నల్లెల్లలో..



తొర్రూరులో..



దోర్నకల్: గొల్లచర్లలో..

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ.. 1980 ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భవించిందని, నేడు ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీ బీజేపీనే అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

- సాక్షి నెట్‌వర్క్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వెంకన్న

నెహ్రూసెంటర్: జిల్లాలో అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షం కారణంగా మొక్కజొన్న, వరి, మిరప పంటలకు నష్టం జరిగిందని రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తడిసిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మక్కలకు క్వింటాకు రూ.30వేలు, మిర్చి క్వింటాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. వర్షం, గాలులతో మామిడితోటకు తీవ్రనష్టం వాటిల్లిందని మామిడి రైతులను న్యాయం చేసేలా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మార్తినేని పాపారావు, సుధాకర్, బొబ్బ వెంకట్‌రెడ్డి, కొత్త వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

తొర్రూరు: కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడాలని సీఐటీయూ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ కోరారు. డివిజన్ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక ఉద్యమ నేత బీటీ రణదివే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవితాంతం కార్మికుల హక్కులకై రణదివే పోరాడారని, ఆయన స్ఫూర్తితో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, కుమార్, రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

గార్ల/కేసముద్రం: జాతీయస్థాయిలో కార్మిక వర్గ స్థాపనకు ఆద్యుడు, కార్మిక పక్షపాతి, సీఐటీయూ జాతీయ నాయకుడు రణదివే అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు అన్నారు. ఆదివారం గార్లలో రణదివే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కందునూరి శ్రీనివాసరావు, అంబటి వీరస్వామి, పెద్దవెంకటేశ్వర్లు, మౌలానా, కోటయ్య, రాంబాబు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు: నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదివాసీలపై హత్యాకాండ నిలిపివేయాలి

తొర్రూరు: ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలపై హత్యాకాండ నిలిపివేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివాసీలపై హత్యాకాండ నిలిపివేయాలని కోరుతూ ఈనెల 20న ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో జరిగే సదస్సు పోస్టర్లను ఆదివారం డివిజన్ కేంద్రంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అటవీ సంపదను కొల్లగొట్టేందుకు యత్నిస్తున్న వారిని అడ్డుకున్న ఆదివాసీలపై పోలీసుల దాడులు, బూటకపు ఎన్‌కౌంటర్లు దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలకుంట్ల సాయిలు, లింగాచారి, జాటోతు భిక్షపతి, శ్రీకాంత్, యాకూబ్, రాములు, నర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మహబూబాబాద్ రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పానకం, వడపప్పు, మజ్జిగ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ గవర్నర్ వేమిశెట్టి కిశోర్ ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ హోమ్ క్లబ్ మహబూబాబాద్ భక్తులకు నాలుగు వేల ప్యాకెట్ల వడపప్పు, పానకం, మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ హోమ్ గౌరవ అధ్యక్షుడు చిదిరాల ఉమాశంకర్, అధ్యక్షులు కర్లపాటి హరిప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి వల్లాల సాయికృష్ణ, కోశాధికారి మిత్తింటి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక నిల్వలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని హజారియా తండా గ్రామ శివారులోని వ్యవసాయ, ఇతర భూముల్లో ఇసుకను కుప్పలుగా పోసి ఉంచారు. ప్రభుత్వ నిషేధాన్ని సాకుగా చూపుతూ అక్రమ ఇసుక వ్యాపారులు అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తూ ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారు. అక్రమ ఇసుక వ్యాపారులు సుమారు యాభై ట్రిప్పుల ఇసుకను నిల్వ చేశారని స్థానికులు తెలిపారు.



హజారియా తండా గ్రామ శివారులో ఇసుక డంపులు

అనుమతులు లేకుండా నిర్మాణాలు

చిన్నగూడూరు: అనుమతులు లేకుండా అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తులపై అధికారులు చర్య తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. బాధితుడు ఖమ్మం జిల్లాకు చెందిన పుచ్చకాయల దేవేందర్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చిన్నగూడూరు మండల కేంద్రంలోని సర్వే నంబర్ 4ఏ/ఇ, 3/ఇలో గల భూమిని మన్నె ప్రదీప్ చంద్ర వద్ద నుంచి కొనుగోలు చేసి, 2023లో రిజిస్ట్రేషన్ చేసుకున్నామని తెలిపాడు. మేము అందుబాటులో లేని సమయంలో మా భూమిలో మండల కేంద్రానికి చెందిన నీలం శంకరయ్య, అనుచరులు అక్రమంగా ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారన్నారు. అంతేగాకుండా ఈ భూమి మాది, భూమి జోలికి రావద్దని బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈవిషయంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి మా భూమిని ఇప్పించాలని బాధితుడు దేవేందర్ కోరుతున్నాడు.